
సాక్షి ప్రకాశం

గురువారం | 13 | జూలై | 2023



కార్ల దొంగ అరెస్టు

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కార్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఒంగోలుకు చెందిన షేక్ అమీర్ ను కావలి పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..



భద్రత విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

భద్రత విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ సిబ్బందిని ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గేయ కవితల పోటీకి ఆహ్వానం

ఒంగోలు అర్బన్: రాష్ట్ర స్థాయి గేయ కవితల పోటీకి ఆహ్వానం పలుకుతున్నట్లు అక్షర సాహితీ సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీకి వచ్చిన గేయ కవితల్లో మంచి భావుకత ఉన్న మూడు గేయ కవితలు ఎంపిక చేసి నగదు బహుమతులు ఇస్తారన్నారు. జూలై 25లోపు కవితలు పంపాలని తెలిపారు. వివరాలకు 9948409528 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పశు వైద్య సేవారథాలకు సిబ్బంది నియామకం

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పశు వైద్య సేవారథాలకు సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పాతపాటి బాలచంద్రుడు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలో ఖాళీగా ఉన్న పశు ఆరోగ్య సేవారథాల్లోని పశు వైద్యులు, వాహన డ్రైవర్ల అవసరం ఉందన్నారు. పశు వైద్యులుగా చేయటానికి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత ఉండాలన్నారు. అదేవిధంగా డ్రైవర్‌గా దరఖాస్తు చేసుకునేవారు రెండు, మూడేళ్ల అనుభవం ఉన్న హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. అర్హులైన వారు జిల్లా మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా మేనేజర్ బాలచంద్రుడు 90328 76888 మొబైల్ నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

సిలిండర్ల పరిశ్రమకు స్థలం కేటాయింపు

ఒంగోలు అర్బన్: జిల్లాలోని రాగముక్కలపల్లిలో సిలిండర్ల పరిశ్రమ కోసం 24.13 ఎకరాల స్థలం కేటాయించినట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పోలార్డ్ గ్రూప్‌నకు చెందిన పోలార్డ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు సదరు యూడీఎల్ స్థలానికి సంబంధించిన అలాట్‌మెంట్ లెటర్‌ను కంపెనీ డైరెక్టర్ సాగినాల రణదీప్ గౌతమ్‌కు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేటాయించిన యూడీఎల్ స్థలంలో ఇండస్ట్రియల్ ఏరియాలో ఎల్‌పీజీ సిలిండర్ల ఇంటిగ్రేటెడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్ సుమారు రూ.43 కోట్లతో స్థాపిస్తారన్నారు. దీనిలో 175 మందికి ప్రత్యక్షంగా, 350 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ కంపెనీ 12 నుంచి 15 నెలల్లో స్థాపించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీనిలో తయారైన సిలిండర్లను 5 నుంచి 6 దేశాలకు ఎగుమతి చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ ఏపీఐఐసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీటీఆర్‌ఐలో పొగాకు విత్తనాల విక్రయం



కందుకూరు: 2023–24 పంట సీజన్‌కు సంబంధించి పొగాకు విత్తనాల విక్రయం ఈ నెల 13వ తేదీ నుంచి రాజమండ్రి కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రం (సీటీఆర్‌ఐ)లోను, ఈనెల 19వ తేదీ నుంచి కందుకూరులోని సీటీఆర్‌ఐలో ప్రారంభమవుతుందని సీటీఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ యమ్ శేషుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఎస్, ఎన్‌ఎల్ఎస్, ఎస్ఎల్ఎస్ ప్రాంతాల రైతులందరికీ సీటీఆర్‌ఐలోనే నాణ్యమైన పొగాకు విత్తనాలు అందిస్తామని చెప్పారు. సీటీఆర్‌ఐ ద్వారా రూపొందించిన విత్తనాలు కేవలం రాజమండ్రి సీటీఆర్‌ఐ, కందుకూరు సీటీఆర్‌ఐలో మాత్రమే విక్రయిస్తారని, ఇతరుల వద్ద లేదా దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తనాల కోసం వచ్చే రైతులకు కింది నిబంధనలకు లోబడి విక్రయిస్తారన్నారు.

- పొగాకు విత్తనాలు సీటీఆర్‌ఐ సీడ్ పోర్టల్ ద్వారా మాత్రమే విక్రయిస్తారు.
- టీబీజీఆర్ పాస్‌బుక్ కలిగిన రైతులందరికీ ప్రతి బ్యారన్‌కు 500 గ్రాములు ఇస్తారు. ఒక కిలో విత్తనాల ధర రూ.1000 రైతులు చెల్లించాలి.
- విత్తనాల కొనుగోలు కోసం పొగాకు బోర్డు జారీ చేసిన బ్యారన్ రిజిస్ట్రేషన్ పాస్‌బుక్ (టీబీజీఆర్ బుక్) తప్పనిసరిగా తీసుకుని రావాలి
- విత్తన విక్రయాలు క్యాష్‌లెస్ లావాదేవీలైన యూపీఐ (గూగుల్‌పే, ఫోన్‌పే మొదలైనవి) ద్వారా మాత్రమే చేస్తారు.
- విత్తనాలు ఈనెల 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మాత్రమే విక్రయిస్తారు
- పొగాకు బోర్డు ద్వారా రిజిస్ట్రేషన్ చేయించిన కమర్షియల్ నారుమడులకు మడులకు సంబంధించిన రైతులకు ఆగస్టు 1వ తేదీ నుంచి కిలో విత్తనాలు రూ.1600 చొప్పున విక్రయిస్తారు.

సీజనల్ వ్యాధులపై సమరమే..

సీజనల్ వ్యాధులపై జిల్లా యంత్రాంగం సమరభేరి మోగించింది. వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టింది. మంగళవారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించింది. పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతూనే మరో పక్క వలంటీర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి డెంగీ, మలేరియా, విషజ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తున్నారు. బాధితులకు తక్షణ వైద్యసేవలు అందిచేలా చూస్తారు. జిల్లాలోని 38 మండలాల్లో 7.67 లక్షల గృహాలను సర్వే చేయనున్నారు.

- జిల్లాలోని 38 మండలాల్లో చేపడుతున్న ఇంటింటి సర్వే
- సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, బోదకాలు నివారణకు చర్యలు
- జిల్లాలో 2011 లెక్కల ప్రకారం సుమారు 12 లక్షల జనాభా
- 7.67 లక్షల గృహాలను సర్వే చేయనున్న వలంటీర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు
- ఈ నెల 11 నుంచి 50వ ఫీవర్ సర్వే ప్రారంభం
- తొలి రెండు రోజుల్లో 11.6 శాతం సర్వే పూర్తి, 35 ఫీవర్ కేసుల గుర్తింపు



ఒంగోలులో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న ఏఎన్ఎం, ఆశ వర్కర్, వలంటీరు

ఒంగోలు అర్బన్: ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 50వ ఫీవర్ సర్వేకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాలో ఈ నెల 11వ తేదీ నుంచి ఇంటింటి ఫీవర్ సర్వే ప్రారంభమైంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల బెడద పెరిగి వివిధ రకాల విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ఫీవర్ సర్వేను ప్రారంభించింది. ముఖ్యంగా మలేరియా, డెంగీ, బోదకాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలు చేపట్టింది. ఈ వ్యాధులన్నింటికీ ముఖ్యమైన లక్షణం జ్వరం కావడంతో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టింది. ఇందుకు జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. 38 మండలాల పరిధిలో ప్రతీ ఇంటికీ వలంటీర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు వెళ్లి జ్వరాలు సోకిన వారి వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం ఫీవర్ సర్వే యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఫీవర్ ఉంటే ఎన్ని రోజుల నుంచి ఉంది ఇతర లక్షణాలను తెలుసుకుని వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఎక్కడైనా ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి ఫీవర్ ఉన్నట్లు గుర్తిస్తే ఆ ప్రాంతంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించడంతో పాటు ఆ ప్రాంతంలో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోనున్నారు. ఈ చర్యలతో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపకరిస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలం వస్తే ప్రజల్లో వణుకుపుట్టేది. పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో దోమలు వృద్ధి చెందేవి. సీజనల్ వ్యాధులతో మరణాలు సంభవించినా నాడు పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. కనీసం మందులు కూడా అందించలేని దుస్థితి. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరంతరం పారిశుద్ధ్య పనులను పక్కా ప్రణాళికతో నిర్వహిస్తూ దోమల నివారణకు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, క్వారీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు దోమతెరలు పంపిణీ చేయడమే కాకుండా ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టి జ్వరపీడితులను గుర్తిస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధుల తీవ్రత ఏడాదికి ఏడాదికి తగ్గుముఖం పట్టాయి. అంతేకాకుండా క్లాప్, ఆదర్శ గ్రామాలు, ఫ్రైడే డ్రైడే వంటి కార్యక్రమాలతో మెరుగైన పారిశుద్ధ్యం, ప్రజారోగ్యమే కాకుండా చూడచక్కని గ్రామాలు వెలుస్తున్నాయి.

వేసవికాలం ముగిసి వర్షాకాలం రాకతో వర్షాలు ముమ్మరం అవుతున్నాయి. వీటితో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలి అనేక రకాల జ్వరాలకు దారితీస్తోంది. ఇంటింటి ఫీవర్ సర్వే, క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్), జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఆదర్శ గ్రామాలు, ఫ్రైడే డ్రైడే వంటి ఎన్నో కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తూ సీజనల్ వ్యాధులకు చెక్ పెడుతున్నారు. ఇంటింటి ఫీవర్ సర్వేతో ఏ మాత్రం జ్వరం లక్షణాలు కనిపించినా మలేరియా, డెంగీ వంటి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వస్తే వారికి వెంటనే వైద్య సేవలు అందించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. క్లాప్ ప్రోగ్రామ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రత్యేక వాహనాలను నియమించి తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేసి రీ సైక్లింగ్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఆదర్శ గ్రామాల పేరుతో గ్రామ స్థాయిలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహిస్తూ పారిశుద్ధ్యంతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తూ దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారు. చెరువుల్లో గంబూషియా చేపలు, నీటి నిల్వ ఉన్న కుంటల్లో ఆయిల్ బాల్స్ వంటివి వేస్తూ దోమల వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టారు. గ్రామాల్లో, నగరాల్లో పంచాయతీలు, మున్సిపాలిటీలు ఆవాస ప్రాంతాల్లో ఫాగింగ్ వంటివి నిర్వహిస్తున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 12 లక్షల జనాభా ఉన్నారు. ప్రస్తుతం చేపట్టిన 50వ ఫీవర్ సర్వేలో జిల్లాలో 7.67 లక్షల గృహాలకు వలంటీర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్‌లు వెళ్లి సర్వే చేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన సర్వేలో రెండు రోజుల్లో 18,161 గృహాలను సందర్శించి 11.6 శాతం పైగా సర్వే పూర్తి చేశారు. ఈ సర్వే మరో వారం పది రోజుల పాటు నిర్వహించి నూరుశాతం పూర్తి చేయనున్నారు. ఫీవర్ సర్వేను జిల్లా మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 8 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 2 ఏరియా ఆస్పత్రులు, జిల్లా కేంద్రంలో ఒక మాతా శిశు వైద్యశాల, ఒక సర్వజన ఆస్పత్రి ద్వారా జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో మొత్తం 492 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు చేయగా వాటిలో సుమారు 300 వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి.

సీజనల్ వ్యాధులపై అవగాహనతో ఉండాలి



అధికార యంత్రాంగం తీసుకునే చర్యలతో పాటు ప్రజలు సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తిపై అవగాహనతో ఉండాలి. ప్రజారోగ్యం కోసం చేపట్టిన ఫీవర్ సర్వేకు ప్రజలు సహకరించాలి. ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి సరైన పరీక్షలు నిర్వహించి వైద్య చికిత్స పొందాలి. సీజనల్ వ్యాధులు, దోమల వృద్ధి అరికట్టేందుకు వైద్య శాఖ అధికారులతో పాటు పంచాయతీలు, మున్సిపాలిటీ అధికారులను సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నాం. ఫీవర్‌సర్వేల నుంచి పారిశుద్ధ్య పనుల వరకు నిరంతరం పర్యవేక్షణతో పక్కా చర్యలు చేపట్టాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



వర్షాలు కురిసే సీజన్‌లో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకుని ముందుగానే వైద్య సేవలు పొందితే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. కలెక్టర్ నిరంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేయడంతో పాటు పర్యవేక్షించడంతో క్షేత్ర స్థాయిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడగలుగుతున్నాం.

– రాజ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ

రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలి

- స్వయం ఉపాధి కోసం యువతకు రుణాలు ఇవ్వాలి
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రాధాన్యత రంగాలతో పాటు ప్రాధాన్యేతర రంగాలకు కూడా రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. బుధవారం ప్రకాశం భవనంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి వివిధ రంగాల్లో ఇచ్చిన రుణాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్షించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.14,590 కోట్ల రుణాలు మంజూరు చేశామని ఎల్‌డీఎం అబ్దుల్ రహీం తెలిపారు. వాటిలో పంట రుణాలకు సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో లక్ష్యంలో 98.23 శాతం, రబీకి 189.13 శాతం రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు లక్ష్యాన్ని మించి 102.7 శాతం రుణాలు ఇచ్చామన్నారు. పట్టణ ప్రాంతాల్లో లక్ష్యం కంటే నాలుగు రెట్లకు పైగా బ్యాంకులు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యేతర రంగాలకు కూడా విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మద్దతుగా నిలవాలన్నారు. మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో పనిచేస్తున్న వారికి కూడా లక్ష్యం మేరకు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకులాగే రైతులకు మరింత మేలు జరిగేలా ఎఫ్‌పీజీలు ఏర్పాటు చేసి ప్రాధాన్యతను బట్టి సీసీఆర్‌సీలు ఇవ్వాలని ఆదేశించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు కేవలం వ్యవసాయం పైనే ఆధారపడకుండా ఏడాది పొడవునా వారికి ఆదాయం వచ్చే రంగాల్లో రాణించేలా అవసరమైన ఆర్థిక సహాయం అందించాలన్నారు. మైనార్టీలకు ఆర్థికంగా సహకారం అందించాలన్నారు. స్వయం ఉపాధి కోసం రూడ్‌సెట్ ద్వారా శిక్షణ పొందిన యువతకు బ్యాంక్ లింకేజి ద్వారా రుణాలు ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ, మెప్మా పీడీ రవికుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి గోపిచంద్, జిల్లా పరిశ్రమల సంస్థ మేనేజర్ శ్రీనివాసరావు, మైనార్టీ సంక్షేమ అధికారి అర్చన, చేనేత జౌళి శాఖ అధికారి ఉదయ్‌కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, రూడ్‌సెట్ అధికారులు పాల్గొన్నారు.

సేవకు సలాం..

కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో పేదలు నానా ఇబ్బందులు పడ్డారు. ఒంటరిగా ఉన్న వృద్ధులు ఆదుకునే దిక్కులేక అలమటించారు. ఆ సమయంలో ఆపద్బాంధవుల్లా గ్రామ వలంటీర్లు వారికి అండగా నిలిచారు. కరోనా సోకిన వారిని భయపడకుండా దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. లాక్‌డౌన్‌తో ఇళ్లలో ఉండేవారికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో సరుకులు అందించారు. అర్హులైన వారందరికీ పింఛన్లు ఇప్పించి ప్రతినెలా ఒకటో తేదీనే వారికి పింఛను అందజేస్తున్నారు.

కరోనా సమయంలో ఎంతో అండగా నిలిచింది



మా వలంటీర్ సయ్యద్ నజ్మా కరోనా సమయంలో నన్ను ఎంతగానో ఆదుకుంది. నేను ఒక్కదానినే ఉంటాను. వలంటీర్ అందించిన సేవలతో బతికి బయట పడ్డాను. నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించి, తగు జాగ్రత్తలు చెప్పింది. అంతే గాక నాకు వితంతు పింఛన్ వస్తుంది. ప్రతి నెలా పొద్దున్నే ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తుంది. ఏనాడూ పింఛన్ నగదు కోసం ఎదురు చూడలేదు. నా ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటోంది. నాకు ఏ సహాయం కావాలన్నా వలంటీర్ ద్వారా చేయించుకుంటాను.

– పుట్లూరి వరలక్ష్మమ్మ, కనిగిరి

క్షతగాత్రులకు ఆర్టీసీ ఎండీ పరామర్శ



కిమ్స్ ఆస్పత్రిలో లో దర్శి బస్సు ప్రమాద క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు అర్బన్: దర్శి బస్సు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఒంగోలు కిమ్స్ ఆస్పత్రిలో ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎస్పీ మలికాగర్గ్ బుధవారం పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న షేక్ యజ్దాన్, షబ్బీర్ ముల్లా, సలీమున్నీసాలను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ప్రమాదం జరిగిన తీరును క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. దీనిలో ఎస్‌బీ డీఎస్పీ మరియదాసు, సబ్ డివిజనల్ డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, కిమ్స్ హాస్పిటల్ ఎండీ అంకిరెడ్డి, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

ఆరని నిరసన జ్వాలలు

- పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

చీమకుర్తి: వలంటీర్లపై నిరాధారమైన అసత్య ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్‌పై నిరసన జ్వాలలు ఆరడం లేదు. వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చీమకుర్తి బస్టాండ్ సెంటర్లో బుధవారం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ముందుగా దిష్టిబొమ్మను ఊరేగించుకుంటూ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేసి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వం తరఫున నిస్వార్థంగా సేవలందిస్తూ కరోనా సమయంలో సైతం ప్రాణాలే పణంగా పెట్టి వైద్యసేవలందించిన తమను నోటికొచ్చినట్లు పవన్ కల్యాణ్ మాట్లాడటం సరికాదన్నారు. పవన్ చేసిన ఆరోపణలపై డీజీపీకి ఆధారాలు చూపాలని, లేకుంటే వలంటీర్లకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని చీమకుర్తి మున్సిపాలిటీలోని 8వ సచివాలయం పరిధిలో గల వలంటీర్లు డిమాండ్ చేశారు. అనంతరం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రామిరెడ్డికి ఫిర్యాదు చేశారు.



పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఒంగోలు సబర్బన్: ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ దశల్లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో జీ 20 థింక్–వన్ ఎర్త్, వన్ ఫ్యామిలీ అండ్ ఏ క్విజ్ దట్ యునైట్స్ అన్న పేరుతో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనరల్ నాలెడ్జ్ అంశాలపై నిర్వహించే ఈ పోటీల్లో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీలోగా అన్ని పాఠశాలలు, కళాశాలలు ఈ క్విజ్ పోటీల్లో పాల్గొనటానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు, ఒక స్టాండ్ బై విద్యార్థి, ఒక గైడ్ టీచర్, ఒక ప్రత్యామ్నాయ గైడ్ టీచర్‌తో కూడిన టీం వివరాలు మాత్రమే సమర్పించాలన్నారు. ఒక రిజిస్ట్రేషన్ కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్లు చేస్తే ఆ పాఠశాలలను పోటీ నుంచి డిస్ క్వాలిఫై చేస్తారని చెప్పారు. పోటీల్లో విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తారని, పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ఈ–సర్టిఫికెట్ ప్రదానం చేస్తారన్నారు. డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ద ఇండియన్ నావీక్విజ్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెలాఖరులోపు అన్ని పాఠశాలలు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాల్సిందిగా కోరారు.



జిల్లాలో 399.85 మి.మీ వర్షపాతం



నాగులుప్పలపాడు మండలం బీ నిడమానూరులో ఇంట్లోకి వచ్చిన వర్షపు నీరు

ఒంగోలు అర్బన్: గడిచిన 24 గంటల్లో జిల్లాలో 399.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నాగులుప్పలపాడు మండలంలో 106.8 మి.మీ నమోదు కాగా, అత్యల్పంగా బేస్తవారిపేటలో 1.2 మి.మీ కురిసింది. జిల్లా కేంద్రం ఒంగోలులో 10.6, తాళ్లూరు 68.2, మద్దిపాడు 47.2, కురిచేడు 35, కొత్తపట్నం 29.6, దర్శి 20.4, దొనకొండ 14.2, సంతనూతలపాడు 12.4, చీమకుర్తి 10.4, ముండ్లమూరు 9.6, టంగుటూరు 6, శింగరాయకొండ, పుల్లలచెరువు 4.6, త్రిపురాంతకం 4.4, యర్రగొండపాలెం 4, మార్కాపురం 3.4, పెద్దారవీడు 2.6, కొండపి 2.2, పీసీపల్లి, తర్లుపాడు 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి 10.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

రెండు కార్డులు.. రెండు పథకాలు

పొదిలి మండలం కాటూరివారి పాలెం గ్రామానికి చెందిన గాజుల రమాదేవి ఒంటరి మహిళ. తల్లిదండ్రులు చనిపోయారు. కట్టుకున్నోడు వదిలేశాడు. పిల్లలు లేరు. పొలం లేదు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఏ ఆధారం లేక పోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వలంటీరు వ్యవస్థ తీసుకురావడంతో ఆమెకు ప్రభుత్వ పథకాలు పొందే భాగ్యం కలిగింది.

– పొదిలి రూరల్



వలంటీర్ నారాయణమ్మ మా ఇంటికి వచ్చి రైస్ కార్డుకు దరఖాస్తు చేయించడంతో వెంటనే కార్డు వచ్చింది. ఆ తర్వాత పింఛను కోసం అర్జీ పెట్టించడంతో ఒంటరి మహిళ పింఛను మంజూరైంది. ఆరోగ్య శ్రీ కార్డు కూడా వచ్చింది. రైస్ కార్డు లేక మెదటి సంవత్సరం కాపు నేస్తం డబ్బు పొందలేక పోయాను. రైస్ కార్డు మంజూరైనప్పటి నుంచి కాపు నేస్తం వరుసగా వస్తోంది. వలంటీరు సాయం వల్లే ఇవన్నీ వచ్చాయి.

– గాజుల రమాదేవి, కాటూరివారిపాలెం, పొదిలి మండలం

వలంటీర్లను బెదిరిస్తే సహించం

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

పామూరు: ప్రజాసేవకులుగా మన్ననలు పొందుతున్న వలంటీర్లను ఎవ్వరైనా బెదిరింపులకు గురిచేసినా, వారిని దూషించినా సహించేది లేదని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న వలంటీర్లను కించపరుస్తూ పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని, ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థ సీఎం జగన్‌కు రెండు కళ్లు వంటివన్నారు. రూ.5 వేల గౌరవ వేతనంతో వలంటీర్లు ప్రతి నెలా అవ్వాతాతలు, అక్కా చెల్లెమ్మలకు, పేదలకు మేమున్నామంటూ గడప గడపకు పథకాలు అందిస్తున్నారని, అలాంటి వారిపై ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు చేయడం దారుణమన్నారు. పవన్‌కళ్యాణ్‌ను రాష్ట్ర ప్రజలు ప్యాకేజీ స్టార్‌గా గుర్తించారని, అతను ఎవరి కోసం పాటుపడుతున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రజలకోసం అహర్నిశలు పని చేసే సీఎం, వలంటీర్లను నిందిస్తే సహించేది లేదని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పవన్‌కళ్యాణ్ ఉన్మాదిలా, సైకోలా మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలను రెచ్చగొడుతూ భయానక వాతావరణం సృష్టించాలనుకుంటున్నాడని ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. పామూరు నాల్గవ సచివాలయానికి చెందిన వలంటీర్ షేక్.సుభాని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం సాయంత్రం నిరసనలో ఆయన చిత్రపటాన్ని చెప్పుతో కొట్టగా..జనసేన నాయకులు సుభానిని పిలిపించి..తప్పు చేసినట్లు చెప్పించి అతనితో పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేయించడం ఏంటని ప్రశ్నించారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, తక్షణం వారు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్, అతని కుటుంబసభ్యులకు హానీ జరిగితే జనసేన నాయకులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గోళ్ల వెంకటేశ్వర్లు, సచివాలయ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, చప్పిడి అజయ్, ఎంపీటీసీ బొట్లా నాగార్జున, బారాషరీఫ్, ఓబుల్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

భద్రత విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మలికాగర్గ్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు అర్బన్: భద్రత విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతమైన విధులు నిర్వహించాలని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. స్థానిక పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో మహిళా కానిస్టేబుళ్లకు ప్రాక్సిమేట్ సెక్యూరిటీపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎస్పీ బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శిక్షణకు 13 జిల్లాలకు చెందిన 63 మంది మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న మెళకువలను గుర్తించుకొని బందోబస్తు, కాన్వాయ్, వీవీఐపీ, వీఐపీ కార్యక్రమాల్లో భద్రత విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వివిధ కార్యక్రమాల్లో స్త్రీ సమూహాల నుంచి ముఖ్యమంత్రికి ఎటువంటి అసౌకర్యం, హానీ కలగకుండా బాధ్యతయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. భద్రత విధుల్లో తప్పిదం జరిగితే పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో అహర్నిశలు కష్టపడుతూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ డి.ఆశీర్వాదం, సెక్యూరిటీ ఆఫీసర్ మోహన్‌రావు, డీఎస్‌బీ డీఎస్పీ మరియదాసు, ఇతర అధికారులు హాజరయ్యారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కేపీ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే కేపీ

పొదిలి రూరల్: దర్శి వద్ద బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను బుధవారం మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పరామర్శించారు. పొదిలిలోని మృతుల నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాము అండగా ఉంటామని మనోధైర్యం చెప్పి భరోసా కల్పించారు. బస్సు ప్రమాదంలో గాయపడి పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు ఒంగోలు వెళ్లారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్కే నూర్జహాన్ బేగం, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు, పట్టణ బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు పులిగొర్ల శ్రీనివాసరావు, మంగాపురం నరసింహులు, మందలపు శ్రీనివాసరెడ్డి, అంబవరపు నారాయణరెడ్డి, చేరెడ్డి సుబ్బారెడ్డి, మస్తాన్‌వలి, ముల్లా జాకీర్, ముల్లా హసన్‌వలి, జిలానీ తదితరులు ఉన్నారు.

కార్ల దొంగ అరెస్టు

- రూ.15 లక్షల విలువైన మూడు కార్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కార్లతో డీఎస్పీ వెంకటరమణ, సీఐ సుధాకర్

కావలి రూరల్: నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కార్ల దొంగతనం చేస్తున్న ఒంగోలుకు చెందిన షేక్.అమీర్‌ను కావలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ ఎం.వెంకటరమణ కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి, కేసు వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన సయ్యద్ సిద్దిక్ అహ్మద్, ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన షేక్.అమీర్ స్నేహితులు. అందరితో కలివిడిగా ఉండేవారు. ఇదేలా కార్ల యజమానులతో కూడా సన్నిహితంగా ఉంటూ వారికి డ్రైవర్లుగా వెళ్లేవారు. ఈ క్రమంలో వారు వివాహాల కోసం కార్లను అద్దెకు తీసుకుని వెళ్లి వాటిని తిరిగి ఇవ్వకుండా గుర్తు తెలియని వ్యక్తులకు కుదువపెట్టుకుని వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుండేవారు. పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీకి చెందిన షేక్ షాహుల్ తన కారును అద్దెకు ఇస్తుండేవాడు. ఈ క్రమంలో ఆ కారుపై వీరిద్దరి కన్నుపడింది. యజమానితో మాట్లాడి కారును అద్దెకు తీసుకెళ్లి కుదువ పెట్టుకుని సమాధానం చెప్పకుండా తిరుగుతుండడంతో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎ.సుధాకర్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా నిందితులు కావలిలో తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో గాలింపు చర్యలు చేపట్టి షేక్ అమీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు విచారించగా అతని వద్ద సుమారు రూ.15 లక్షల విలువ చేసే మూడు కార్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కాగా కావలికి చెందిన సయ్యద్ సిద్దిక్ అహ్మద్ పరారీలో ఉన్నారని, త్వరలోనే అతన్ని కూడా అరెస్టు చేస్తామని డీఎస్పీ వెంకటరమణ తెలిపారు.

దేశ భద్రత కోసమే సాగర్ కవచ్

- రామాయపట్నం మెరైన్ సీఐ కిషోర్‌కుమార్

సింగరాయకొండ: సాగర్ కవచ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తే దేశభద్రతకు ఎటువంటి ఢోకా ఉండదని రామాయపట్నం మెరైన్ సీఐ ఆర్‌ఎస్ కిషోర్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. జిల్లా పరిధిలోని ఐదు తీరప్రాంత మండలాల్లో బుధవారం సాగర్‌కవచ్ కార్యక్రమం నిర్వహించారు. తీర ప్రాంతంలోని మత్స్యకారులకు సివిల్, మెరైన్ పోలీసులు సాగర్ కవచ్ ప్రధాన ఉద్దేశాన్ని వివరించి, తీరప్రాంత భద్రతపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు తీరంలో తిరుగుతున్నా, ఎవరైనా అపరిచితులు తీరం గుండా సముద్రంలోకి వెళ్లే ప్రయత్నం చేసినా వారిని అడ్డుకోవడంతోపాటు ఆ సమాచారాన్ని వెంటనే తెలియజేయాలని కోరారు. తద్వారా సముద్ర మార్గం గుండా తీవ్రవాదులు అక్రమ చొరబాట్లకు పాల్పడకుండా అడ్డుకోవచ్చని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలను పోలీసు, మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు సంయుక్తంగా ఎలా ఎదుర్కోవచ్చో విపులంగా వివరించారు. కార్యక్రమంలో ఐదుగురు సీఐలు, 8 మంది ఎస్సైలు, 129 మంది సిబ్బంది పాల్గొన్నారు.



ఊళ్లపాలెం పంచాయతీలోని దేవలం పల్లెపాలెం వద్ద మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ పోలీసులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండపి: భార్యతో మనస్పర్థల నేపథ్యంలో ఎలుకల మందు తిన్న వ్యక్తి ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 10వ తేదీ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వై.రమణయ్య తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. స్థానిక ఎన్టీఆర్ సెంటర్‌లో టిఫిన్ హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న కె.సుందరయ్య(37)కు ఈ నెల 5 తేదీన భార్య నాగమణికి మధ్య మాటామాట పెరిగి వివాదం రేగింది. దీంతో నాగమణి అదే రోజు రాత్రి ఎలుకలు మందు తిన్నది. ఆమె భర్త సైతం అదే మందు తిన్నాడు. హోటల్లో పనిచేసే మరో వ్యక్తి వారిని గమనించి ఒంగోలు వెంకటరమణ వైద్యశాలకు తరలించారు. సుందరయ్య ఈ నెల10 తేదీ రాత్రి చనిపోగా భార్య నాగమణికి ప్రాణాపాయం తప్పింది. ఒంగోలు పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలుశిక్ష

కనిగిరి రూరల్: చెక్ బౌన్స్ కేసులో నిందితుడు బాపనపల్లి వెంకటేశ్వరరావుకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ జడ్జి కె.భరత్‌చంద్ర తీర్పునిచ్చినట్లు కోర్టు సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం..కనిగిరికి చెందిన పైడి మర్రి ఫణిబాబు దగ్గర ఒంగోలుకు చెందిన బాపనపల్లి వెంకటేశ్వరరావు రూ.5 లక్షలు అప్పు తీసుకుని దాని తాలూకు ఒక చెక్కును ఇచ్చాడు. ఈ ఫణిబాబు ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. ఈ మేరకు చెక్కు బౌన్స్ కేసుపై విచారణ జరిపిన జడ్జి బుధవారం తీర్పునిచ్చారు. చెక్ బౌన్స్ కేసులో నిందితుడైన బాపనపల్లి వెంకటేశ్వర రావుకు ఏడాది జైలుశిక్ష విధించారు. అలాగే రూ. 5 లక్షలు నష్టపరిహారం కూడా నిందితుడైన బాపనపల్లి వెంకటేశ్వరరావు చెల్లించాలని తీర్పులో వెల్లడించారు.


70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

మార్కాపురం టౌన్: కొనకనమిట్ల మండలం మర్రిపాలెం నుంచి యర్రగొండపాలేనికి అక్రమంగా తరలిస్తున్న 70 బస్తాల బియ్యాన్ని బుధవారం మార్కాపురం మండలం రాయవరం గురుకుల పాఠశాల వద్ద స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్సై కాసు వెంగళరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తిరుపతిరెడ్డి తెలిపారు. మర్రిపాలేనికి చెందిన బొలెరో వాహనంలో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్ శివప్రసాద్‌తోపాటు వాహనాన్ని రూరల్ పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో విజిలెన్స్ ఏఓ సంఘమేశ్వరరెడ్డి, సిబ్బంది రవి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బేల్దారి కూలీ మృతి



సంప్‌లో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమ్మ

ఒంగోలు సబర్బన్: సంపులో పడి బేల్దారి కూలీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన ఒంగోలు నగరంలోని విరాట్ నగర్ వెనుక వైపు సంఘంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక గంతాపాలేనికి చెందిన అంకమ్మ వరప్రసాద్(38) బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యథావిధిగా బుధవారం కూడా కర్నూలు రోడ్డులోని సంఘంలో కొలగాని వెంకట అనుదీప్‌కు చెందిన భవనంలో పనిచేయడానికి వెళ్లాడు. ఏమి జరిగిందో ఏమో కానీ సంప్‌లో మృతదేహమై తేలాడు. అక్కడి వారు మాత్రం జారిపడి మృతి చెందాడని చెబుతున్నారు. తాలూకా ఎస్సై అంకమ్మ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ రాంబాబు పేర్కొన్నారు.

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- శోకసంద్రమైన చినగానిపల్లె
- నివాళులర్పించిన ఆర్మీ అధికారులు



పిచ్చయ్య (ఫైల్)



పిచ్చయ్య భౌతికకాయాన్ని సెల్యూట్ చేస్తున్న సుబేదార్ నాయుడు

రాచర్ల: మండలంలోని చినగానిపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఈర్నపాటి పిచ్చియ్య (38) గుండెపోటుతో హిమచల్‌ప్రదేశ్‌లోని ఆర్మీ వైద్యశాలతో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. పిచ్చయ్య భౌతికకాయాన్ని పోస్టుమార్టం అనంతరం హిమచల్‌ప్రదేశ్ యూనిట్ ఆర్మీ అధికారులు బుధవారం ఉదయం 5 గంటలకు చినగానిపల్లె గ్రామానికి తీసుకువచ్చారు. పిచ్చయ్య భౌతికకాయాన్ని చూడగానే తల్లిదండ్రులు చిన్న వెంకటయ్య, భూషణంతో పాటు భార్య ఈర్నపాటి నిర్మల, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆర్మీ జవాన్ భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు, బంధువులు, మండల అధికారులతో పాటు ఆర్మీ అధికారులు ఘన విడ్కోలు పలికారు. సుబేదార్ సీహెచ్ నాయుడు, హవల్దార్ కె.ప్రభాకర్ రెడ్డి, లాంచ్ నాయక్ కె.నరేంద్రర్ రెడ్డి, తహసీల్దార్ ఎం దిలీప్‌కుమార్, ఎస్సై జి.కృష్ణపావని, చినగానిపల్లె సర్పంచ్ పగడాల రమేష్, ఒంగోలు అంధ్రా ఎన్‌సీసీ యూనిట్ ఆర్మీ యూనిట్ జస్‌ఫాల్ సింగ్ సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు జి.అంకన్న, మండలంలోని మాజీ సైనికులు పాల్గొన్నారు.

అథ్లెట్ అనూషను ఆదర్శంగా తీసుకోండి

- సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి



అనూషను సత్కరిస్తున్న సిద్ధార్థ మహిళా కళాశాల యాజమాన్యం, సిబ్బంది

విజయవాడ స్పోర్ట్స్: ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం పెదయిర్లపాడుకులో పేద కుటుంబంలో జన్మించి పట్టుదలతో జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణిస్తున్న అథ్లెట్ మల్లాల అనూషను యువత ఆదర్శంగా తీసుకోవాలని సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి సూచించారు. ప్రపంచ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలకు వెళ్తున్న అనూషను సిద్ధార్థ మహిళా కళాశాల యాజమాన్యం బుధవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. సిద్ధార్థ మహిళా కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అనూష ప్రపంచ స్థాయి క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు అనేక జాతీయ పతకాలను అనూష సొంతం చేసుకుందన్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించిన ఆనూష ట్రిపుల్ జంప్‌లో గోల్డ్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. అనంతరం భువనేశ్వర్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో మొదటి స్థానం సాధించి చైనాలో ఈ నెల 28 నుంచి జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ట్రిపుల్ జంప్ ఈవెంటలో ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా మొక్కవోని దీక్షతో అంతర్జాతీయ క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్న అనూషను ఆదర్శంగా తీసుకోవాలని కళాశాల విద్యార్థినులకు సూచించారు. క్రీడాకారిణి అనూష మాట్లాడుతూ.. ప్రపంచ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం అందజేసిన సిద్ధార్థ అకాడమీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపింది. ప్రపంచ పోటీల్లో పతకం సాధించి, సిద్ధార్థ కళాశాల ఖ్యాతిని చాటుతానని స్పష్టం చేసింది. కళాశాల కన్వీనర్ ఎస్.ఎల్.ప్రసాద్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ, వ్యాయామ అధ్యాపకురాలు వి.లక్ష్మీకనకదుర్గ పాల్గొన్నారు.

గొడ్డలికర్రతో దాడి

- తలకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న లింగయ్య

హనుమంతునిపాడు: మండల పరిధి ఎలికవారిపల్లిలో కుటుంబ కలహాలతో వ్యక్తిపై గొడ్డలికర్రతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు..గ్రామానికి చెందిన ఇరికసాని లింగయ్య, ఎలిక చిన్న తిరుపతయ్యకు కుటుంబ కలహాలున్నాయి. గతంలో లింగయ్యపై ఎలిక చిన్న తిరుపతయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు ఉంది. పోలీసులు లింగయ్యను మందలించి పంపిచారు. బుధవారం చిన్న తిరుపతయ్య, ఇరికసాని లింగయ్య ఇద్దరు మధ్య కుటుంబకలహాలతో గొడవపడ్డారు. ఈ తగాదాలో ఎలిక చిన్న తరుపతయ్య గొడ్డలికర్ర తిప్పి ఇరికసాని లింగయ్యపై దాడి చేయగా..లింగయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని బంధువులు ఆటోలో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కనిగిరిలో వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై పి.శివ నాగరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

త్రిపురాంతకం: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలం కేశినేనిపల్లి సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. సంఘటనా స్థలాన్ని ఎస్సై సుమన్ పరిశీలించారు. మృతుడి వివరాల కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సాక్షి క్లాసిఫైడ్స్

Education

PARAMEDICAL

■ ప్రభుత్వ గుర్తింపు కలిగిన పారామెడికల్ డిప్లొమా కోర్సులకు 2023-2024 సం॥నకు అడ్మిషన్లు జరుగుచున్నవి. DMLT (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ) DOA (ఆప్తాల్మిక్ అసిస్టెంటు), DRGA (రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్) అర్హత: ఇంటర్, స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజ్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-979]

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1468]

ADMISSIONS

■ MPHW (F) - ANM (2 Yrs) రెగ్యులర్ నర్స్‌ట్రైనింగ్ & DMLT కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ ఏనీగ్రూప్, SC, ST, BC, OBC లకు స్కాలర్‌షిప్ & హాస్టల్ వసతి కలదు. సంప్ర॥ ఝాన్సీ నర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఒంగోలు. ✆ 94402 74196 [OA-1]

Real Estate

LAND FOR SALE

■ ఒంగోలు, పేర్నమిట్ట, పాన్యప్రాపర్టీ వారి హిల్‌సిటీ వెంచర్ దగ్గర, కర్నూల్‌రోడ్ ఆనుకొని 78సెంట్లు, వెంచర్లకు అనుకూలమైన పొలం అమ్మబడును. సంప్ర॥ ✆ 98661 33175. [O-786132]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సం॥ ✆ 99121 05656. [O-787281]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2406]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781990]

వధువు కావలెను

■ కాపు/28/5'8"/B.Tech/బ్యాంక్‌మేనేజర్/10 Lakhs/4 Cr/గల వరునకు తగిన వధువు కావలెను. అన్ని కులాలవారి పెళ్ళిసంబంధాలు కొరకు సం॥ మధువర్షిణి మ్యారేజెస్) ✆ 93921 92193 [O-787280]

జ్యోతిషాలయం

■ మనకి కానీ మన పిల్లలకు కానీ మనకి తెలిసిన వాళ్ళకు కానీ ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రసిద్ధ జ్యోతిష్య నిపుణులు రత్న శాస్త్ర నిపుణులు 28 సం॥ అనుభవం గల కేరళ జ్యోతిష్య నిపుణులు. సంప్ర॥శ్రీ బాపూజీ కాంప్లెక్స్ షాపు నెం.45 ఒంగోలు. ✆ 8921 411 713 [OA-996]

Wanted

■ A1 PEST Control నందు 25 సం॥లోపు 10th to డిగ్రీ అర్హత గల యువతి, యువకులు కావలెను. మంచి జీతం+రూమ్+మీల్స్ ఫ్రీ. వివరాలకు సంప్ర॥ ✆ 84648 63989, 76618 13989 [O-786135]

■ శ్రీ వెంకటేశ్వర ఫైనాన్షియల్స్ నందు - ఒంగోలు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు అనుభవజ్ఞులైన ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ వెంటనే కావలెను. ✆ 76809 02220, 79979 96425 [O-787284]

■ స్టడీ ఇన్ అబ్రాడ్ నందు పనిచేయుటకు టెలీకాలర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతాలు ఇవ్వబడును. గుప్తాస్ స్క్వేర్, ఒంగోలు. ✆ 63042 33031 [O-786136]

■ ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ JLS కావలెను. జీతం: 10 నుండి 15 వేలు. సంప్ర॥ ✆ 85003 01111 [OA-999]

■ మాసెక్యూరిటీ సంస్థనందు S.కొండ పరిసరాలలో పనిచేయుటకు సె॥గార్డులు & ASO లు కావలెను.మంచిజీతం+PF&ESI, రూం, భోజనంఫ్రీ,✆8790935585,7075148896 [O-786133]

■ ఉడ్‌ల్యాండ్ షోరూం, కర్నూల్‌రోడ్, ఒంగోలు నందు పనిచేయుటకు సేల్స్‌మెన్, సేల్స్‌బాయ్స్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సంప్ర॥ ✆94413 26697 [O-786134]

■ ఒంగోలు సమతానగర్‌లోని శ్రీ గాయత్రి గ్రామర్ స్కూల్ నందు, హైయర్ క్లాసులకు మ్యాథ్స్, ఇంగ్లీష్ టీచర్స్ మరియు ప్రైమరీ టీచర్స్ కావలెను. సంప్ర॥ ✆ 90144 04155 [OA-994]

■ మా ఆఫీసు నందు పనిచేయుటకు టెలీకాలర్స్ కావలెను. కనీసం 1 సం॥ అనుభవం కలవారు సంప్ర॥ బాపూజీ కాంప్లెక్స్, ఒంగోలు. ✆ 89214 11713 [OA-997]

■ ఒంగోలు సిటీ, పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ॥ 12గం॥లు జీ॥ 13,000/-PF, ESI కలవు. ఫ్రీ రూం+ సబ్సిడీ మీల్స్ కలవు. Age: 45సం॥లోపు. 6302252056, 7286909727 [G-786452]

■ ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడులోగల గ్రానైట్ ఫ్యాక్టరీకి, ఒంగోలులో గల ఇంజనీరింగ్ కాలేజీకి చదువు, అనుభవం గల హెడ్‌గార్డ్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచిజీతం ✆ 78938 84421 95739 59881 [B-786398]

■ గ్లోబల్ కంపెనీలో డిజిటల్‌గా వర్క్ చేస్తూ నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు లేవు. సంప్ర : 79956 36002 [V-797226]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు వ్రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6190]

■ ప్రముఖ కార్గో కొరియర్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు క్యాబిన్ క్రూలోడింగ్ ఫుల్ సర్వీసెస్, ఆఫీస్ ఎడ్మిన్, సూపర్‌వైజర్స్, గ్రౌండ్ స్టాఫ్, టీమ్ లీడర్స్ కావలెను. Qul : 10th to any Degree, డిప్లొమా, ITI, Age : 18 to 35, భోజనం + రూమ్ వసతి, జీతం. 25,000 to 32,000/- ✆ 81255 60645 [B-1193467]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. హైదరాబాద్ Ph: 9640258899, విజయవాడ Ph:9640648899 [H-189305]

■ MS కంపెనీ నందు ఇంటి నుంచి పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్‌వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ ఫిమేల్, Qly: 10th, జీతం: 16,000 -18,000, Ph: 9948969231, 8008860389 [HA-400]

■ Wanted Lady Wardens (Un Married) Contact : Gandhi High School, Mangamur Road, Ongole. Cell: ✆ 93904 10032 [OA-3]

■ Wanted Unmarried Graduate Male Wardens to Working Narayana Public School, Mangamur Road, Ongole. Con: ✆ 98491 83364. [OA-989]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ : ఒంగోలు
90102 02856
90102 02762